నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 29 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL

ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ అర్జీలు ఇవ్వద్దు

● కలెక్టర్ అభిలాష అభినవ్

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 28 : ఒకే సమస్యపై ప్రజలు మళ్లీ మళ్లీ దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం లేదని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని, శాఖలవారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని ఏబీవీపీ నిరసన

నిరసన తెలుపుతున్న విద్యార్థులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 28 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి వివేకానంద చౌక్ వరకు విద్యార్థులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ మాట్లాడుతూ.. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్‌ను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్నత చదువులకు పేద విద్యార్థులు దూరమవుతున్నారన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆకాశ్, సాయి, మున్న, జగదీశ్, విశాల్, రుతిక్, నవదీప్, కార్తీక్, మల్లేశ్ పాల్గొన్నారు.

నాణ్యత పేరిట కొనుగోళ్లలో జాప్యం

సోయా రైతుల గోస

● ఇప్పటికే 70 శాతానికి పైగా పంట విక్రయాలు..
● ఆన్‌లైన్‌లో పంట నమోదు కాక అమ్ముకోలేని దుస్థితి
● ఆంక్షల అమలుతో మద్దతు ధరకు దూరమైన అన్నదాతలు

నష్టపోతున్న రైతులు

ఆదిలాబాద్

ఎండలో ఆరబెట్టిన సోయా

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో విక్రయానికి వచ్చిన సోయా

ఆదిలాబాద్, అక్టోబర్ 28(నమస్తే తెలంలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో సోయా రైతులకు కష్టాలు తప్పడం లేదు. వానకాలంలో 71,226 ఎకరాల్లో సోయా సాగు చేశారు. సీజన్‌లో 4,27,356 క్వింటాళ్ల పంట విక్రయానికి వస్తుందని అంచనా వేసిన అధికారులు కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 20 రోజుల కిందటే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది వాతావరణం సహకరిచడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు సరాసరి 10 క్వింటాళ్ల వరకు సోయా దిగుబడి వస్తుంది. ప్రాథమిక సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటను సేకరిస్తున్నారు. మొదట ఎకరాకు ఆరున్నర క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేశారు. రైతులు ఆందోళనల ఫలితంగా ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పును కొంటున్నారు.

నాణ్యత, తేమ పేరిట జాప్యం

ఈ ఏడాది సోయా మద్దతు ధర క్వింటాలుకు రూ.4,892తో ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో గుడి హత్నూర్ పీఏసీఎస్ ద్వారా కొనుగోళ్లు జరుగున్నాయి. ఇక్కడికి ఆదిలాబాద్ రూరల్, మావల, జైనథ్, తలమడుగు మండలాల నుంచి రైతులు భారీగా పంటను విక్రయానికి తీసుకొస్తున్నారు. గంపెడాశతో పంటను అమ్మడానికి తీసుకొచ్చిన రైతులకు పంట నాణ్యత లేదని, వ్యర్థాలు ఉన్నాయని, తేమ శాతం ఎక్కువ ఉందంటూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అనడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. పంటను ఎండలో ఆరబెట్టాలని, జల్లెడ పట్టాలని కొనుగోలు కేంద్రాల సిబ్బంది సూచిస్తున్నారు. కొనుగోళ్లకు నిర్వాహకులు నిరాకరించి వారు చెప్పిన విధంగా రైతులు చేస్తున్నారు. పంటను అక్కడే ఎండలో ఆరబెట్టడానికి, జల్లెడ పట్టడానికి కూలీల ఖర్చులు రైతులు భరించాల్సి వస్తుంది. దీంతోపాటు పంట కొనుగోలుకు కాపాల కాయాల్సి వస్తుంది. పీఏసీఎస్ సిబ్బందిని తమ పంట కొనాలని బతిమాడాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. సోయాబిన్‌ను ఇంటివద్ద ఆరబెట్టి, జల్లెడ పట్టి తీసుకొస్తున్నా కొనుగోలు కేంద్రాల్లో తమకు తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

❖ జాలీ పట్టమంటున్నారు..

నేను 40 క్వింటాళ్ల సోయాను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు అమ్మడానికి తీసుకొచ్చా. సోమవారం ఉదయం మాక్స్ వాహనంలో పంటను తెచ్చా. కొనుగోలు చేయాలని పీఏసీఎస్ సిబ్బందిని కోరితే పంట నాణ్యతగా లేదు. జల్లెడ పట్టించిన తర్వాత కొంటామని అంటున్నారు. సోయాబిన్‌ను ఇంటి వద్ద జల్లెడ పట్టి తీసుకొచ్చామని చెప్పినా వినడం లేదు. చేసేదేమీ లేక జల్లెడ పట్టిస్తున్నా. దీంతో కూలీ డబ్బులు ఆదనంగా ఖర్చవుతున్నాయి.

- మార్కండి, రైతు, యాపల్‌గూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం

❖ నాణ్యత లేదని కొనుగోలు చేయడం లేదు..

నేను 25 క్వింటాళ్ల సోయాబిన్‌ను ఉదయం ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. పంటను పరిశీలించిన కొనుగోలు కేంద్రాల సిబ్బంది తుక్కు ఉంది, జల్లెడ పట్టిన తర్వాత కొంటామని అంటున్నారు. పంట నాణ్యత బాగా ఉందని చెప్పినా పట్టించుకోవడం లేదు. జల్లెడ పట్టడంతో అదనంగా డబ్బులు ఖర్చవుతున్నాయి. అధికారులు పంట నాణ్యత విషయంలో రైతుల సూచనలు పరిగణలోకి తీసుకోవాలి. వారి ఇష్టానుసారంగా వ్యవహరించవద్దు.

- సతీశ్, రైతు, యాపల్‌గూడ, ఆదిలాబాద్ రూరల్

నిర్మల్

పంట అమ్ముకున్నాక.. కేంద్రాల ఏర్పాటు..

ప్రైవేట్ వ్యాపారుల వైపే మొగ్గు చూపుతున్న సోయా రైతులు

కుభీర్‌లో కొనుగోళ్లు లేక వెలవెల బోతున్న సోయా సెంటర్

నిర్మల్, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ) : జిల్లాలో సోయా రైతులకు కష్టాలు తప్పడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం కొనుగోళ్ల విషయంలో అమలు చేసిన విధానాలను పక్కన బెట్టి, ప్రస్తుత ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలను అమలు చేస్తుండడం సోయా రైతుల పాలిట శాపంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఈ వానకాలంలో అన్ని రకాల పంటలు కలిపి 4 లక్షల ఎకరాల వరకు సాగు చేయగా, ఇందులో 1.04 లక్షల ఎకరాల్లో సోయా సాగు చేశారు. ఎకరానికి సగటున 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా.. మొత్తం 80 వేల మెట్రిక్ టన్నులు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. సోయాను సాగు చేసిన రైతు ల వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటేనే ఎకరానికి 10 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. దీంతో చాలా మంది రైతులు సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. దీంతో మద్దతు ధరకు దూరమయ్యే ప్రమాదం ఉంది. దిగుబడులు వచ్చి 20 నుంచి 30 రోజులు గడుస్తున్నా.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. సెంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులను కోరినప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో గత్యంతరం లేక తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుని ఆర్థికంగా నష్టపోయారు. ప్రభు త్వం క్వింటాలుకు రూ.4,892ల మద్దతు ధరతో తొ మ్మిది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు క్వింటాలుకు రూ.4200-రూ. 4400 చొప్పున అమ్మారు. ఇలా 70 శాతం పంట ప్రై వేటు వ్యాపారుల చేతికి వెళ్లింది. చేతులు కాలాక ఆకు లు పట్టుకున్న చందంగా మార్క్‌ఫెడ్ ఐదు రోజుల క్రి తం తొమ్మిది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిం ది. కేంద్రాల వద్దకు కొంతమంది రైతులు మాత్రమే వ స్తున్నారు. అయితే సెంటర్ల వద్ద సవాలక్ష కొర్రీలు విధించి రైతులను ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా తూకంతోపాటు తేమ, నాణ్యతా విషయంలో సెంటర్ల సిబ్బంది ఇబ్బందులు సృష్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రైతుల పేర్లపై ఆన్‌లైన్‌లో సోయా సాగు చేసినట్లు చూపడం లే దంటూ తిప్పి పంపుతున్నారు. ఇలా అనేక రకాల కొ ర్రీల మధ్య ప్రైవేటు వ్యాపారులకే అమ్ముకునేందుకు రై తులు మొగ్గు చూపుతున్నారు. మార్క్‌ఫెడ్ కేంద్రాల వద్ద పెద్దగా కొనుగోళ్లు లేక వెలవెల బోతున్నాయి.

❖ ఆన్‌లైన్‌లో తక్కువగా నమోదు చేశారు..

నాకు 18 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ వానకాలం ఏడెకరాల్లో సోయా పంట వేసిన. 20 రోజుల క్రితమే పంట చేతికొచ్చింది. త్వరలోనే సోయా కొనుగోలు సెంటర్‌ను ఏర్పాటు చేస్తారంటే ఇన్ని రోజులు ఆగిన. మూడు రోజుల నుంచి కుంటాల సొసైటీలో సోయా కొంటున్నారని చెబితే ఈ రోజు సెంటర్‌కు వచ్చిన. నా పేరు మీద రెండెకరాల్లోనే సోయా సాగు చేసినట్లు ఉందని అంటున్నరు. ఎకరానికి 10 క్వింటాళ్ల చొప్పున 20 క్వింటాళ్లే కొంటరట. మిగతా మూడెకరాల పంట ప్రైవేటులో తక్కువ ధరకు అమ్ముకోవాలి. ఇదే విషయం ముందే చెబితే 15 రోజుల కిందనే అమ్ముకునే వాళ్లం. ఇలా ఇబ్బంది పెట్టడం ప్రభుత్వానికి మంచిది కాదు.

- ప్రభాకర్, రైతు, సూర్యాపూర్, కుంటాల మండలం

❖ ప్రైవేటులోనే అమ్ముకున్న..

నాకున్న ఎనిమిదెకరాల్లో సోయా వేసిన. దిగుబడి మంచిగనే వచ్చింది. పంట చేతికొచ్చి దాదాపు 20 రోజులు అవుతున్నది. పంట ఏసినప్పుడు ఏఈవో వచ్చి రాసుకుని పోయిండు. మొత్తం ఎనిమిది ఎకరాల్లో సోయా వేసినట్లు రాయించిన. అయినా ఒక్క గుంట కూడా ఆన్‌లైన్‌లో ఎక్కించలేదు. ఆన్‌లైన్‌లో లేకుంటే కొనరని ఆఫీసర్లు చెప్పిర్రు. చేసేదేమి లేక మొత్తం పంటను క్వింటాలుకు రూ.4,200 చొప్పున ప్రైవేటు వ్యాపారులకే అమ్మిన. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంటర్లలో క్వింటాలుకు రూ. 4900 ఇస్తున్నరట. నాలాంటి చాలా మంది రైతులు ప్రైవేట్లోళ్లకే అమ్ముకున్నరు. అన్ని అమ్ముకున్నంక ఇప్పుడు సర్కారోళ్లు అచ్చి కొంటున్నరు. లేనిపోని రూల్స్ పెట్టడం వల్ల క్వింటాలుకు రూ.700 నష్టపోయినం. ఈ కాంగ్రెస్ పాలనల రైతులకు అన్ని బాధలే.

- రాథోడ్ సుధాం, రైతు, సిర్పెల్లి తాండ, కుభీర్ మండలం

బీసీ కమిషన్‌కు వినతులు వెల్లువ

● రిజర్వేషన్లు అమలు చేయాలి..
● సమస్యలను పరిష్కరించాలి..
● 90 వినతులు అందజేత

బీసీ కమిషన్ సభ్యులకు సమస్యలు తెలియజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ) : జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు కోరాయి. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో బీసీలకు స్థానిక సంస్థలవారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను ఖరారు చేసే అంశంపై బహిరంగ విచారణ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి బీసీ సంఘాల ప్రతినిధులు కార్యక్రమానికి హాజరై కమిషన్ సభ్యులకు వినతులు అందజేశారు. బీసీలకు రాజకీయాల్లో రిజర్వేషన్లు పెంచిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని పలువురు సూచించారు. కుల వృత్తులు చేసుకుంటూ జీవిస్తున్న వారి ఉపాధి మెరుగుపడేలా కార్పొరేట్ తరహాలో ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వ సముదాయాల్లో దుకాణాలను కేటాయించాలని కోరారు. జీవో 29 కారణంగా బడుగు, బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని, ఈ జీవోను ఎత్తివేయాలని పలువురు సూచించారు. ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభాలో 15 శాతం ఉన్న మైనార్టీలకు 15 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మైనార్టీ నాయకులు కోరారు.

సమగ్ర సర్వేలో వివరాలు అందజేయాలి..

: - బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

ప్రభుత్వం నిర్వహించే సమగ్ర సర్వేలో బీసీ సంఘాల నాయకులు సమగ్ర వివరాలు పొందుపర్చేలా సహకారం అందించాలని, సర్వే కోసం ఇంటికి వచ్చిన ఎమ్యూనేటర్‌లకు బీసీలు తమ పూర్తి వివరాలు అందజేయాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, ఇతర కులాల సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ కమిషన్ బహిరంగ విచారణతోపాటు సర్వేలో తేలిన లెక్కల ప్రకారం బీసీకు రిజర్వేషన్‌లు అమలు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో నిర్వహించిన బహిరంగ విచారణ విజయవంతమైందని వివిధ సంఘాల నుంచి 90 వినతులు అందాయన్నారు. ఎవరైనా సలహాలు, సూచనలు అందజేయాలనుకుంటే రాతపూర్వకంగా తమ కార్యాలయానికి పంపాలని, నేరుగా వచ్చి వచ్చె నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అందజేయవచ్చని సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎస్టీ జనాభా ఎక్కువ ఉన్నందున ఇక్కడి జడ్పీ చైర్మన్ పదవిని ఎస్టీలకు రిజర్వు చేయాలనే సూచన వచ్చినట్లు తెలిపారు. బీసీ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల కలెక్టర్‌లు రాజర్షి షా, అభిలాష అభినవ్, దీపక్, అధికారులు పాల్గొన్నారు.

బేల ఉర్దూ పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులు

బేల ఉర్దూ మీడియం పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో నర్సింలు

బేల, అక్టోబర్ 28 : ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో 136 మంది విద్యార్థులకు ఒకే ఒక్క ఉపాధ్యాయురాలు బోధిస్తున్న విషయాన్ని ఈ నెల 26న 'బోధన అస్తవ్యస్తం' శీర్షికన నమస్తే తెలంగాణ ప్రచురించింది. కథనానికి స్పందించిన ఎంఈవో కోల నర్సింలు సోమవారం ఈ పాఠశాలను సందర్శించారు. అక్కడ పరిస్థితి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి మొహబత్‌పుర పాఠశాల నుంచి వినోద్, బేల మరాఠీ ప్రాథమిక నుంచి ఈశ్వర్ అనే ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై కేటాయించామని తెలిపారు. వారు సోమవారం విధుల్లో చేరారని వివరించారు. అలాగే దీపావళి తరువాత బేల తెలుగు మీడియం ఉన్నత పాఠశాల నుంచి సురేఖ అనే ఉపాధ్యాయురాలు కూడా ఇక్కడ విధులు నిర్వర్తిస్తారన్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎం నస్రీమ్ జాను ఎంఈవోకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా.. డిప్యూటేషన్‌పై వస్తున్న ఉపాధ్యాయులకు ఉర్దూ రాదు. ఎలా పాఠాలు చెబుతారో చూడాలి.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

అర్జీదారులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, అక్టోబర్ 28 : గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. సోమవారం స్థానిక పీవో క్యాంపు కార్యాలయంలో అర్జీలను స్వీకరించారు. దంతన్‌పల్లి గ్రామానికి చెందిన రామస్వామి తనకి పెన్షన్ ఇప్పించాలని, జన్నారం మండలంలోని మొర్రిగూడ గ్రామానికి చెందిన రాహుల్ తనకి వికాసం పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించాలని, తిర్యాణి మండలంలోని మొర్రిగూడ గ్రామానికి చెందిన టేకం రాజు తనకు ఏడ్ల జత మంజూరు చేయాలని, సిర్పూర్(యూ) మండలంలోని మెలిగూడ గ్రామానికి చెందిన భువనేశ్వరి తనకి ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే మరికొందరు గిరిజనులు డబుల్ బెడ్రూం ఇండ్లు, పింఛన్లు, ఉపాధి పథకాలు, వ్యవసాయ పనిముట్లు లాంటివి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ వసంత్‌రావు, ఏవో దామోదర స్వామి, ఉమాదేవి, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు పాల్గొన్నారు.

గంప గుత్తతో అన్యాయం

● రాత్రికి రాత్రి రేటు కుదిర్చి మోసం చేస్తున్నారు..
● రైతులు మేలుకుని బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి..
● కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యేను హెచ్చరిస్తున్నాం..
● విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న

మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

బేల, అక్టోబర్ 28 : రాత్రికి రాత్రి గంప గుత్త విధానంలో ప్రైవేట్ వ్యాపారులతో లోపాయికారి ఉప్పందం కుదుర్చుకుని, కొనుగోళ్లు నిర్వహించడమే కాక తేమ శాతం సాకు చూపుతూ రైతులను మోసం చేస్తున్నారని మాజీ మంత్రి జోగు రామన్న ఫైర్ అయ్యారు. బేల మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. దీపావళి పండుగ పూట రైతుల జీవితాలను చీకటిమయం చేయడం తగదన్నారు. రైతు సంఘం నాయకులు, రైతుల సమక్షంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశాలను చీకటి ఒప్పందంలో నిర్వహించడం సరికాదన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, బీజేపీ నాయకులున్నప్పటికీ సీసీఐ ద్వారా రైతులకు ధర కల్పించడంలో విఫలం చెందారన్నారు. కనీసం కమర్షియల్ పర్చేస్ అనుమతులు తీసుకోలేని పరిస్థితిలో ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నారని మండిపడ్డారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం కూడా పత్తితో పాటు ప్రతి పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేయడంతో రైతుల తీవ్ర ఇబ్బంది ఎదుర్కొవడం జరుగుతుందన్నారు. హర్యానా, పంజాబ్, గుజరాత్ కంటే నాణ్యమైన పత్తి ఆదిలాబాద్ అని, వాటి సరసన ఆదిలాబాద్ కూడా పత్తి ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మనోహర్, నాయకులు సతీశ్ పవర్, గంబీర్ ఠాక్రే, ప్రమోద్ రెడ్డి, తన్వీర్ ఖాన్, తేజ్‌రావ్, దేవన్న, మంగేశ్, మనోజ్, సంజయ్, మధుకర్ గోడే తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జోనల్ స్థాయి ఈత ఎంపిక పోటీలు

ఎదులాపురం, అక్టోబర్ 28 : జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో సోమవారం జోనల్ స్థాయి(ఉమ్మడి జిల్లా) ఈత ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి హాజరై మాట్లాడారు. అన్ని వ్యాయామాల్లో ఈత అద్భుతమని, ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతారావు, పోటీల నిర్వాహకుడు రాష్ట్రపాల్, ఈత శిక్షకులు కృష్ణ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 4న జోనల్ స్థాయి బాలుర కబడ్డీ ఎంపిక పోటీలు

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నవంబర్ 4న తలమడుగు మండలంలోని బరంపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-17 బాలుర జోనల్ స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతారావు, పోటీల కన్వీనర్ పాఠశాల హెచ్ఎం ప్రత్యూష తెలిపారు. జనవరి 1, 2008 తర్వాత పుట్టినవారు ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు వయస్సు ధ్రువీకరణ, బోనఫైడ్ పత్రాలతో ఉదయం 9 గంటలకు పీడీ రవీందర్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు.

ఈత పోటీల్లో గెలుపొందిన వారికి మెడల్స్‌ను అందజేస్తున్న జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి